విశాలాంధ్ర కృష్ణా జిల్లా

టీడీపీ-బీజేపీ-జనసేన కలయిక చారిత్రాత్మకం

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం: 2024 ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీల కలయిక చారిత్రాత్మకమైనదని మాజీ ఎంపీ, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు అన్నారు. ఆదివారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమినిపార్టీ సభ్యులుగా అందరం స్వాగతిస్తున్నామని, రాష్ట్రంలో నెలకొన్న క్లిష్టపరిస్థితుల కారణంగా అధినేత చంద్రబాబు పొత్తు నిర్ణయం తీసుకున్నారని, వైసీపీనిరంకుశపాలనను తుదముట్టించేందుకు కలిసి పోటీ చేయనున్నాయి పేర్కొన్నారు. జగన్‌రెడ్డి పాలనలో అప్పులాంధ్రగామారి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడిందని, కులంతో సంబంధం లేకుండా బీసీలు, ఎస్సీ, ఎస్టీలపై దాడులు జగన్ రెడ్డి ప్రభుత్వంలో జరిగాయి అన్నారు. తెలుగు ప్రజల కోసం, ఆంధ్రప్రదేశ్ అభ్యున్నతి కోసం తెలుగుదేశం పార్టీ సంకల్పించిన మహాయజ్ఞానికి ఇటు జనసేనతో పాటు, బీజేపీ కూడా కలిసి వస్తోందని నారా చంద్రబాబు నాయుడు దార్శనిక పాలన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రక్షగా ఉంటుందని మేము నమ్మాము, అతిపెద్ద జాతీయ పార్టీతో పాటు దేశం మొత్తం మాకు మద్దతిస్తోందని తెలిపారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ళ జగన్నాథరావు (బుల్లయ్య),మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, జిల్లా ప్రచార కార్యదర్శి పీవీ ఫణి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం : బండారు

విశాలాంధ్ర-బంటుమిల్లి :- ప్రజా ప్రతినిధుల సహాయ సహకారాలతో తమ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని కంచడం సర్పంచ్ బండారు చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని శివారు ఉన్న కంచడం గ్రామపంచాయతీ గతంలో అభివృద్ధికి ఆమడదూరంలో ఉండదని, వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు నడుస్తుందని కంచడం సర్పంచి అన్నారు. రూ.33 లక్షలతో 3 కిలోమీటర్ల దూరం జి ఎస్ బి రోడ్డు పనులను ఆదివారం సర్పంచి చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లడుతూ కొద్ది రోజుల క్రితం గ్రామంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా గ్రామనికి విచ్చేసిన మంత్రి జోగి రమేష్, ఎంపీ వల్లభనేని బాలసౌరి గ్రామ రహదారుల దుస్థితిని పరిశీలించి దాదాపు 5 కిలోమీటర్ల దూరం కంచడం నుండి ముంజులూరు హైవే వరకు రూ.2.20 కోట్లు ఆర్&బి శాఖ నిధుల నుండి మంజూరు చేయించి బిటి రోడ్డు వేయడం పనులు పూర్తయ్యాయన్నారు.

కాజలో కొనసాగుతున్న 'పల్లెబాట'

విశాలాంధ్ర-కూచిపూడి : పామర్రు నియోజకవర్గ తెలుగుదేశంజనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి వర్ల కుమార్ రాజా ఆదివారం కాజ గ్రామంలో 35వ రోజు పల్లెబాట కార్యక్రమాన్నినిర్వహించారు. ఉదయం నుంచి గ్రామం దళితవాడలైన మట్ల మాలపల్లి, మందపాలెం, కళాయిగుంటే శివారు గ్రామాలలో పర్యటించారు. కాజ గ్రామంలో నిర్వహించిన మాటామంతికార్యక్రమంలో పాల్గొని హెటల్స్, దుకాణాలు, ఇండ్లవద్దప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తాతా నారాయణరావు, మాజీ వైస్ ఎంపీపీ యార్లగడ్డ శ్రీనివాసరావు, కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులుగానున్న మాజీ వైస్ ఎంపీపీనన్నపనేనివీరేంద్ర, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు యార్లగడ్డ చందు, మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు రామలింగేశ్వర రావు, వీరంకి తులసీదాసు, మాజీ ఎంపీటీసీరాయవరపు అరుణ్ కుమార్, ఆంజనేయులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పద్దారాయుడు తోటలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు.

రాష్ట్ర బీసీ సంఘం గౌరవాధ్యక్షుడిగా రావులకొల్లు

విశాలాంధ్ర-గుడివాడ : బీసీ నాయకుడిగా గుడివాడ నియోజకవర్గంలో అనేక సేవలను అందించిన రావులకొల్లు మల్లేశ్వరరావు నేడు రాష్ట్ర బిసి సంఘం గౌర్వ అధ్యక్షుడిగా నిమించడం పట్లు ఆదివారం అయన స్వగృహంలో పలువురు బిసి సంఘ నాయకులు పూలమాలలు, దుశాల్వతో సత్కరించారు. ఈ సందర్భంగా బిసి సంఘం నియోజకవర్గ అధ్యక్షులు దారం నరసింహరావు మాట్లాడుతూ బిసిల అభ్యునత కోసం కృషి చేసిన నాయకుడికి సరైన గుర్తింపు నిచ్చే పదవి రావడం ,అయన మరీన్ని పదవులు అదురోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు అగస్తి ఆదివిష్ణు, దొండపాటి వెంకటకృష్ణారావు, బందారు రాధకృష్ణ, నెరుసు శ్రీనివాసరావు, బోయిన సోమశేఖర్, చింతలూరి సత్యనారయణ, తానా రాధ, శ్రీను, ఆర్‌విఎల్ నరసింహరావు, సత్యనారయణ, నవీన్, తుమ్మలచర్ల శ్రీనివాసరావు, యన్. ప్రభాకర్, కోలసు రాజా, రావులకొల్లు సుబ్రమ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

కూటమి అధికారంలోకి వస్తే బీసీలకు రక్షణ

విశాలాంధ్ర-పెదపారుపూడి : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు మండల బీసీ నాయకులు పాలాభిషేకం చేసి అభినందనలు కురిపించారు. ఈ సందర్భంగా టిడిపి మండల ప్రధాన కార్యదర్శి, బీసీ విభాగం మండల నేత మసిముక్కు రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం జనసేన కూటమి అధికారంలోకి వస్తే బీసీలకు రక్షణ చట్టం, 50 సంవత్సరములకే పెన్షన్ సౌకర్యం, బీసీ సబ్ ప్లాన్ తదితర ప్యాకేజీలను మేనిఫెస్టోలో పొందుపరిచినందుకు మండలంలోని చినపారుపూడి గ్రామంలో ఆ రెండు పార్టీల అధినేతల చిత్రపటాలకు పాలాభిషేకం చేసినట్లు మసిముక్కు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, దానబోయిన వెంకటనారాయణ, జాజుల రమేష్, కొడాలి అశోక్, మలినేని వినయ్ కుమార్, పామర్తి స్వామి, పీతా గోపి, గోగం రామారావు, గోవాద రాంబాబు, నగుళ్ల రామాంజనేయులు, నాగుళ్ల శ్రీనివాసరావు, బోయిన రాఘవులు, కసుమూరి నాగమల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'రేగుళ్లంక' నిర్మాణం పూర్తయ్యేనా ?

- పిల్లర్లకే పరిమితమైన వంతెన నిర్మాణం
- 2016లో నిర్మాణానికి రూ.1.10 కోట్లు
- శంకుస్థాపన చేసిన నాటి మంత్రి అయ్యన్న
- ముందుకు రాని కాంట్రాక్టర్లు
- కన్నెత్తి కూడా చూడని ఎమ్మెల్యే
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

శంకుస్థాపన చేసిన ప్రాంతం

విశాలాంధ్ర-అవనిగడ్డ : మండల పరిధిలోని పులిగడ్డ సివారు రేగుళ్ళంక గ్రామం గురించి చెప్పాలంటే కృష్ణానదికి వరద వచ్చిన ప్రతిసారి ఆ ప్రాంత ప్రజలకు దినదిన గండం నూరెళ్ళ ఆయుషు అనే విధంగా రేగుళ్ళంక గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతూ ఉంటారు. ప్రతి సంవత్సరం కృష్ణానది తన ప్రవాహ దిశను మార్చుకుంటూ నదీ సమీపంలోని గ్రామాలపై విరుచుకుపడుతుంది. రేగుళ్ళంక గ్రామం కూడా కృష్ణానదికి పక్కనే ఉండటంతో వరద నీరు గ్రామంలోనికి చొచ్చుకుని రావడమే కాకుండా.. నీటి ప్రవాహానికి

అడవిలా మారిన శంకుస్థాపన ప్రదేశం, శిలాఫలకం

గ్రామం కోతకు గురౌతు క్రమంగా నదిలో కలిసిపోతుంది. అటువంటి సమయంలో గ్రామ ప్రజలు రేగుళ్ళంక గ్రామాన్ని దాటి రక్షణ ప్రదేశానికి రావడానికి అవకాశం లేకపోవడంతో బిక్కుబిక్కుమంటూ అక్కడే కరకట్టపై సిబిరాలు ఏర్పాటు చేసుకోవలసిన పరిస్థితి ఈ గ్రామంలో సుమారు 150 కుటుంబాల వారు నివసిస్తూ ఉండగా 90 శాతం మంది దళిత వర్గాలే ఉన్నారు. ఇది అంతా గమనించిన మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ 2016 సంవత్సరంలో ఆ నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడులకు రేగుళ్ళంక గ్రామ పరిస్థితులు వివరించి ఖాళీ బాట వంతెన నిర్మాణానికి సుమారు కోటి రూపాయలు పైగా నిధులు మంజూరు చేయించారు. పులిగడ్డ గ్రామ సివారు రేగుళ్ళంక గ్రామానికి ఖాళీ బాట వంతెన, సిమెంటు రోడ్డు నిర్మాణానికి 2016 నవంబర్ నెలలో అవనిగడ్డ నియోజకవర్గ అప్పటి శాసనసభ్యులు ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో నాటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి అయ్యన్న పాత్రుడు చేతుల మీదుగా వంతెన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం వంతెన పిల్లర్ల దశకు చేరుకున్న తరువాత వంతెన నిర్మాణ పనులు నిలిచిపోవడం, నిధులు మంజూరు అయినా కాంట్రాక్టర్‌తో పనులు చేయించలేకపోతున్నారని, అప్పటి పంచాయితీరాజ్ శాఖ డీఈ రమేష్‌పై మండలి బుద్ధప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్రికా మధ్యమాల్లో కథనాలు వచ్చినా సదరు అధికారిలో చలనం కలుగలేదు సరికదా.... వంతెన నిర్మాణం పిల్లర్ల దశలోనే ఆగిపోవడం ఆ నాటి ప్రతిపక్ష నాయకులు వంతెన నిర్మాణం నిలిచిపోవడంపై ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు. కాగా ఆ నాడు వంతెన నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. దళితులపై చిన్నచూపేలా అంటూ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోసినా నాటి ప్రతిపక్ష నాయకులు నేడు అధికారంలోనికి వచ్చి వారి సమయం కూడా పూర్తి కావస్తున్నా రేగుళ్ళంక వంతెన వైపు కన్నెత్తి చూడకపోవడం గమనర్హం. అధికార పగ్గాలు చేపట్టి 5 సంవత్సరాలు గడుస్తున్నప్పటికి అసలు రేగుళ్ళంక వంతెన అనేది ఉందని మర్చిపోయారా... అన్న సందేహం కల్గుతుంది. అధికారం రాకముందు మేము అదిచేస్తాం... ఇదిచేస్తాం అంటూ ప్రజలు ఎన్నెన్నో హామీలు ఇచ్చి నేడు అధికారం చేపట్టిన తరువాత ఇచ్చిన హామీలను మర్చిపోవడం పరిపాటిగా మారింది. దళితులకు మేనమామ అని చెప్పుకుంటూ వారి ఓట్లతో అధికారం చేపట్టిన వైసిపి నాయకులు అధికారం చేపట్టిన నాటి నుండి దళితులపై తాము ప్రతాపాన్ని చూపుతున్నారు. గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో దళిత వాడలో సిమెంటు రోడ్డు వేయిస్తే నేటి ప్రభుత్వంలో అసలు అలాంటి నిధులు ఉన్నాయా... అనే సందేహం కల్గిస్తున్నారు. 5 సంవత్సరాలుగా నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధి అనేది చూపించకుండా గత ప్రభుత్వం మొదలుపెట్టిన అభివృద్ధి పథకాలను కూడా పూర్తిచేయకపోవడం దారుణమైన విషయం. సుమారు 15 నెలల క్రితం అవనిగడ్డకు రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చిన సందర్భంలో కూడా రేగుళ్ళంక కాలీబాట వంతెన గురించి స్థానిక శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు ప్రస్తావించకపోవడం ప్రజలను ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇప్పటికైనా శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు స్పందించి మండల పరిధిలోని పులిగడ్డ సివారు రేగుళ్ళంక గ్రామానికి పిల్లర్ల దశలో నిలిచిపోయిన కాలి బాట వంతెన నిర్మాణం పునఃప్రారంభించి నిర్మాణం పూర్తి చేసి రేగుళ్ళంక గ్రామ సమస్యను పరిష్కరిస్తారని ఎంతో ఆశగా గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు.

టిడ్కో ఇళ్ల లబ్ధిదారులను న్యాయం చేస్తాం : వెనిగండ్ల

విశాలాంధ్ర-గుడివాడ : టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే టిడ్కొ గృహల రుణాలు అన్ని మాఫీ చేస్తామని, గతంలో ఇల్లు వచ్చిన వారిని తొలగించిన అధైర్య పడవద్దని మీకు న్యాయం చేసేందుకు ఎప్పుడు అందుబాటులో ఉంటామని గుడివాడ నియోజవర్గ టిడిపి ఇన్‌చార్జి వెనిగండ్ల రాము అన్నారు. ఆదివారం ఏలూరురోడ్డులోని టిడిపి ప్రజవేదిక కార్యాలయ్యం నుండి మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, జనసేన నాయకుడు బూరగడ్డ శ్రీకాంత్‌లతో కలసి వెనిగండ్ల రాము టిడ్కో గృహల వద్దకు టిడిపి, జనసేన నాయకులతో కలసి బైక్‌లపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుడివాడలో 8912 మందికి టిడ్కో ఇల్లు నిర్మించిన ఘనత టిడిపిదే అన్నారు. 2018లోనే 3312 మందికి లబ్దిదారులకు పూర్తిస్థాయిలో కేటాయించడం జరిగిందన్నారు. ఎన్నికల్లో ఇళ్లు ఉచితంగా ఇస్తానని హామీ ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి ప్రజలను మోసం చేశాడన్నారు. 80శాతం పూర్తయిన ఫ్లాట్లను, మిగిలిన 20 శాతం పూర్తి చెయ్యడానికి వైసిపి ప్రభుత్వానికి 4ఏళ్లు పట్టిందన్నారు. వెంటనే మా ఫోటోలు లేకుండా కాలనీలో త్రాగునీటి సరఫరాకు పది ట్యాంకర్లు ఏర్పాటు చేస్తాన్నారు. రాబోయే టిడిపి జనసేన కూటమి ప్రభుత్వంలో ఇల్లు మీద ఉన్న బ్యాంకు రుణాలు 3 లక్షల 65వెలు రద్దుచేసి రుణ మాఫీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణా,రూరల్ మండలాధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళీ, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తి మానండి

విశాలాంధ్ర-పమిడిముక్కల: నేరస్తులు, రౌడిషీటర్లు నేరాలకు పాల్పడకుండా నడవడిక మార్చుకోని జనజీవన స్రవంతిలో కలవాలని తమ కుటుంబాలకు అండగా ఉండాలంటూ ఎస్ఐ కె.శ్రీనివాస్ హిత బోధ చేశారు.ఆదివారం జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాలు మేరకు గుడివాడ డిఎస్పీ శ్రీకాంత్ ఉత్తర్వులు,పమిడిముక్కల సి.ఐ.కిషోర్ బాబు పర్యవేక్షిణలో రౌడిషీటర్లుకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొన్నా, కేసుల్లో వున్నా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేసిన, గంజాయి వంటి మత్తు పదార్థాలు వినియోగించినా, అక్రమ రవాణా చేసినా చెడు వ్యసనాలుకి పాల్పడిన పోలీసు నిఘా వుంచామని హెచ్చరించారు.ప్రత్యేంగా ప్రతి ఒక్కరితో మాట్లాడుతూ తమ వ్యవహార శైలి మార్చుకుని సమాజంలో కలిసి తమ కుటుంబాలకు అండగా ఉండాలంటూ నచ్చజెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల్లో ధైర్యం నింపేందుకు ఫ్లాగ్ మార్చ్

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యంగా గుడ్లవల్లేరు పోలీసులు ఆదివారం సాయంత్రం గుడ్లవల్లేరు మండల పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో సాయుధ పోలీసులతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు, ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే ఎన్నికల సమయంలో రాజకీయ పక్షాలు, ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల రూల్స్ ను ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా ప్రవర్తిస్తే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమంలో గుడివాడ రూరల్ సిఐ ఏసుబాబు, ఎస్ఐ సత్యనారాయణ, హేడ్క్వాటర్ నుంచి సిఎఎస్ఎఫ్ 66 మంది సాయుధ పోలీసులు పాల్గొన్నారు.

'చేయూత'తో ఆర్థిక భరోసా : ఉప్పాల

విశాలాంధ్ర-పెడన : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ చేయూత ద్వారా మహిళలకు ఆర్థిక భరోసా కల్పించారని పెడన నియోజకవర్గం వైయస్సార్ పార్టీ శాసనసభ అభ్యర్థి ఉప్పాల. రమేష్ అన్నారు. ఈ మేరకు స్థానిక మార్కెట్ యార్డు నందు చేయూత కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఉప్పాల హారికతో కలిసి పాల్గొని తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప్పాల రమేష్ మాట్లాడుతూ పట్టణ మరియు మండల పరిధిలో సుమారు 2166 మంది మహిళలకు నాలుగో విడత చేయూత పథకం కింద 4,06,12,500/- రూపాయలు వారి ఖాతాలలో జమ అవుతున్నాయి అన్నారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఎక్కడ లేని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలులో సీఎం జగన్ చెప్పాడంటే చేస్తాడు అంతే అనే నానుడికి ఏ మాత్రం తగ్గకుండా గత ఐదు సంవత్సరాల నుండి ప్రతి పథకాన్ని ప్రతి ఏటా తూచా తప్పకుండా అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి మన జగన్ మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు.

జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి : కూచిపూడి పంచాయతీలో జగనన్న కాలనీలో కేటాయించిన నివేశన స్థలాల రిజిస్ట్రేషన్ పట్టాలను ఆదివారం పంపిణీ చేశారు. కూచిపూడి(బొక్కా వారి డొంక)లో మంజూరు చేసిన 229 మందికి, అయ్యంకి పంచాయితీ పరిధిలో కూచిపూడి లబ్దిదారులకు14 మందికి ఇళ్ల స్థలాలను అందజేశారు మొత్తం 243 మందికి రిజిస్ట్రేషన్ నిర్వహించగా 194 మందికే తొలిసారిగా పట్టాలు విడుదలైనాయి. ఈ మొత్తంలో 150 మందికి పైగా లబ్దిదారులకు గ్రామ సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి, ఎం.పీ.టీ.సీ. వెలగంవెంకటరమణ లు వీఆర్వో ఎం ఖాశీంతోకలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం రూపాయి ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేసి లబ్దిదారులకు అందించిన ఇళ్ల స్థలాలో పక్కా ఇల్లు నిర్మించుకొని వినియోగించుకోవాల్సిందిగాసూచించారు. లబ్దిదారులు వీటిని అన్యాకాంతం చేస్తే భవిష్యత్తులో ఇళ్ల స్థలాలు మంజూరు కావని కూడా ఆమె హెచ్చరించారు.

కంప్యూటర్ శిక్షణ సర్టిఫికెట్లు పంపిణీ

విశాలాంధ్ర-అవనిగడ్డ : సైబోర్ జోన్ కంప్యూటర్స్‌లో గత సంవత్సరం నవంబర్‌లో స్వామి వివేకానంద సేవా సంస్థ మరియు సైబర్ జోన్ కంప్యూటర్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత కంప్యూటర్ శిక్షణ ద్వారా 60 మంది శిక్షణ పొందారు. వారికి ఆదివారం సైబోర్ జోన్ కంప్యూటర్స్ నందు శిక్షణ పొంది ఉతీర్ణత పొందిన వారికి కేంద్ర ప్రభుత్వం సంస్థ ద్వారా మంజూరు చేయబడిన సర్టిఫికేట్లను జడ్.పి.టి.సి సభ్యులు చింతలపూడీ లక్ష్మీ నారాయణ అందచేశారు. సైబర్ జోన్ వ్యవస్థాపకులు జట్టి చలం ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్.పి.టి.సి ముఖ్య అతిధిగా పాల్గొని సర్టిఫికెట్లు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రస్తుత యుగంలో కంప్యూటర్ నందు కనీస నైపుణ్యం కలిగిన వారికి మాత్రమే మెరుగైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని జడ్.పి.టి.సి అన్నారు. స్వామి వివేకనంద సంస్థ వారు ఇటువంటి గ్రామీణ ప్రాంతాల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా గ్రామీణ ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు. సైబర్ నిర్వాహకులు బీసాబత్తిన విజయలక్ష్మీ మాట్లాడుతూ దివిసీమ ప్రాంతంలో అన్ని రకాల హంగులతో ఉన్న కంప్యూటర్ సంస్థ ద్వారా రానున్న వేసవిలో ఇంటర్ మీడియట్, 10 వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థి విద్యార్థులు శిక్షణ పొందాలని ప్రత్యేకంగా రానున్న రోజుల్లో గృహిణుల కోసం, విద్యార్థిని విద్యార్థుల కొరకు ఈ సంవత్సరం నుండి స్పోకేన్ ఇంగ్లీషు తరగతులు నిర్వహించనున్నట్లు ఆమె చెప్పారు.

మండుతున్న సూరీడు

విశాలాంధ్ర-కూచిపూడి : మహాశివరాత్రి వెళ్లిన రెండు రోజుల్లోనే సూర్యుడు తన ప్రతాపాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఆదివారం ఉదయం 10 గంటల దగ్గర నుంచి ఒంటిగంటకు 32 డిగ్రీలనుంచి 34 డిగ్రీలకు చేరుకొంది. మార్చి నెల రెండవ వారంలోనే ఎండలు ఈ విధంగా ప్రారంభం కావడంతో వచ్చే రెండు నెలల్లో మరింత ఉధృతం అయ్యే అవకాశాలుంటాయని ప్రజలు ఆందోళనపడుతున్నారు. సోడాలకు, ఐస్ క్రీములకు, కూల్ డ్రింకులకు ఇప్పుడిప్పుడే డిమాండ్ పెరుగుతోంది.

దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు : డీఎస్పీ

విశాలాంధ్ర-అవనిగడ్డ : వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చైల్డ్ హుడ్ గ్రూప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి దాహార్తిని తీర్చడం శుభపరిణామం అని ప్రభుత్వ వైద్యశాల డా॥ గంగాధర్, డివిజినల్ సూపరిడెంట్ ఆఫ్ పోలీస్ మురళీధర్ అన్నారు. ఆదివారం అవనిగడ్డ కోర్టు సెంటర్‌లోని చైల్డ్‌హుడ్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసి చలివేంద్రాన్ని ప్రభుత్వ వైద్యశాల వైద్యులు డా॥ గంగాధర్ ప్రారంభించి మంచినీరు పంపిణీ చేసి మాట్లాడారు. పులిగడ్డ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డిఎస్పీ మురళీధర్, సర్పంచ్ దాసరి విజయ్, చైల్డ్‌హుడ్ గ్రూప్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు మత్తి శ్రీనివాసరావు దంపతులు సంస్థ సెక్రటరీ దివి లీలా కృష్ణలతో కలిసి ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేసి మాట్లాడారు. సర్పంచ్ విజయ్ మాట్లాడుతూ వరుసగా 2 వ సంవత్సరం పులిగడ్డ సర్కిల్‌లో చైల్డ్‌హుడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి 4 నెలల పాటు బాటసారుల దాహార్తిని తీరుస్తూ 4 ,3 పర్యాయాలు మజ్జిగ, పానకం వంటివి పంపిణీ చేస్తున్నారని వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ తమకు ఉన్నంతలో సేవలు అందించేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ ఎం.ఇ.ఒ 2 అన్నపరెడ్డి పిచ్చయ్య, జాయింట్ సెక్రటరీ అలపర్తి గోపాలకృష్ణ, సామర్ల మల్లికార్జునరావు, మోపిదేవి శ్రీనివాసరావు, అన్నపరెడ్డి కృష్ణ, బండె శ్రీనివాసరావు, కమ్మిలి ప్రసాద్, యాసం శోభన్‌బాబు, డా॥ కృష్ణమోహన్, పంద్రాజు వరప్రసాద్, రేపల్లె వెంకటేశ్వరరావు, రేపల్లె అర్జునరావు, రాంమోహన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బార్లపూడి లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం అయ్యంకి పంచాయతీ పరిధిలో గల ప్రభుత్వస్థలాలలోని జగనన్న కాలనీలో గతంలోబార్లపూడి గ్రామానికి చెందిన 19 మందికి నివేశన స్థలాలను పంపిణీ చేశారు. వీటిని గత నెలలో సచివాలయ గ్రేడ్ 5 కార్యదర్శి కే ఆంజనేయులు విఆర్వో తో కలిసి రిజిస్ట్రేషన్ చేయగా వాటిల్లో 11 మందికి మాత్రమేరిజిస్ట్రేషన్ చేసిన పట్టాలు పుస్తకాలు విడుదలైనాయి. యి. వాటిని సర్పంచ్ కాకాని లీలా వెంకట ప్రసాద్ వీఆర్వో ఎం ఖాశీంతోకలిసి ఆదివారం సచివాలయం లో అందజేస్తూ దీనిపై పలు సూచనలు ఇచ్చారు.

ఆర్యవైశ్యుల విజయవాడ మార్చ్ మహాసభ

విశాలాంధ్ర-విజయవాడ : స్థానిక ఆర్యవైశ్యకళ్యాణ మండపం లో ఆదివారం విజయవాడ మార్చ్ 10 జరిగింది. సమావేశంలో ఆర్యవైశ్య సామాజిక వర్గ ప్రజలు ఏ నియోజకవర్గంలో ఎక్కువగా ఉంటే ఆయా నియోజకవర్గాల్లో అన్ని రాజకీయ పార్టీలు ఆర్యవైశ్యులకు ప్రాధాన్యత ఇచ్చి ఎమ్మెల్యే ఎంపీలు అవకాశాలు కల్పించాలని ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు జయంతి వెంకటేశ్వరరావు కోరారు. విజయవాడలో ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గం సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో అన్ని జిల్లాల పాలకవర్గం పాల్గొని రాబోయే ఎన్నికల్లో ఆర్యవైశ్యుల పాత్ర పై చర్చించారు. గతంలో కంటే ఆర్యవైశ్యులు రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఏ రాజకీయ పార్టీ తమకు ప్రాధాన్యత కల్పిస్తుందో ఆ పార్టీ గెలుపుకు ఆర్యవైశ్యులు కృషి చేస్తారన్నారు.

భారతదేశ సంస్కృతికి నిదర్శనం సంస్కృత అధ్యయనం

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక సత్యనారాయణపురంలోని ఉపద్రష్ట వారి సత్రంలో ఆదివారం సంస్కృత భారతి ఆధ్వర్యంలో కృష్ణా జనపద సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా పాల్గొన్న ఆంధ్ర ప్రదేశ్ బాలకేంద్ర ప్రముఖులు ఉపద్రష్ట అరుణశ్రీ, శ్రీ నారాయణం శ్రీనివాసమూర్తిలు మాట్లాడుతూ సంస్కృత భారతి శాఖ అధ్యక్షులు ఉప్రద్రష్ట రామస్వామిశాస్త్రి అధ్వర్యంలో ఇంలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. సంస్కృత నేర్చుకోవటం వల్ల హిందీ, తెలుగు తదితర భాషలు సులభంగా అర్ధమౌతాయన్నారు. జిల్లా స్థాయిలో జరిగే ఈ తరహా జనసద సమ్మేళనాలు సంస్కృత భాష వ్యాప్తికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. అనంతరం వివిధ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులు సంస్కృతంలో నేర్చుకున్న గీతాలు, గేయాలు, రచనలు, ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సంస్కృత భారతి, గుడివాడ శాఖ అధ్యక్షులు ఉపద్రష్ట రామస్వామిశాస్త్రి, కార్యదర్శి పోఫూరి శ్యామసుందర్, కార్యకర్తలు ఎస్.సూర్యకుమారి, కామినేని విజయ, చింతా లక్ష్మి, బాలబాలికల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

నిధులు కేటాయించకుండా నిర్మాణం ఎలా ?

-కొత్తపేట పోలీస్ స్టేషన్ నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలి

విశాలాంధ్ర-విజయవాడ: కొత్తపేట పోలీస్ స్టేషన్ నిర్మాణానికి వెంటనే నిధులు కేటాయించాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీస్ స్టేషన్ నిర్మాణ ప్రాంతాన్ని సీపీఐ నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ 2021 నవంబర్ 29న అప్పటి హెూం శాఖ మంత్రి మేకతోటి సుచరిత శంకుస్థాపన చేసి రెండున్నర సంవత్సరాలు అవుతున్న కేవలం పునాదులుకే పరిమితం అవటం ఈ ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనం అన్నారు. అభివృద్ధి అంశాలలో వైసీపీ ప్రభుత్వం ప్రచార అర్భాటాలే తప్ప ఆచరణకి నోచుకోకపోవడం శోచనీయమన్నారు. నిధులు కేటాయించకుండా నిర్మాణాన్ని ఎలా చేపడతారని ప్రభుత్వాన్ని నిలదీశారు. నిర్మాణం ఎందుకు ఆగిందో ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విస్తారంగా ఉన్న పోలీస్ స్టేషన్ పరిధి ప్రాంతాలకు సరిపడా సబ్ ఇన్స్పెక్టర్‌లు, సిబ్బంది లేకపోవడంతో కేసుల పరిష్కారానికి ఇక్కడ పని చేస్తున్న సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని శాంతి భద్రతల పరిరక్షణ కై మరింత సిబ్బందిని పోలీస్ స్టేషన్ కి కేటాయించాలని కోరారు. పోలీస్ స్టేషన్ పరిధికి మధ్యస్థంగా అందుబాటులో ఉండే ఇక్కడ పోలీస్ స్టేషన్ నిర్మాణానికి తక్షణం నిధుల కేటాయించి అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ పరిశీలనలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యులు తాడి పైడియ్య, పంచదార్ల దుర్గాంబ,కొట్టు రమణారావు, స్థానిక పార్టీ నాయకులు ఎస్‌కే.నజీర్, బోరా రామకృష్ణ, కంచర్ల భార్గవ్, అంజూరి సూరిబాబు, ఎస్‌కే అమీర్ తదితరులు ఉన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా
హైవే బస్టాండ్

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : 65వ నెంబర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న ఆటోనగర్ సమీపంలో రూ.కోటితో నిర్మించిన హైవే బస్టాండ్ ప్రారంభ పనులను ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయ భాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ పట్టణ ప్రజల చిరకాల వాంఛ అయిన హైవే బస్టాండు నిర్మాణం సకలహంగులతో నిర్మించామన్నారు. విజయవాడ- హైదరాబాద్ సర్వీస్ చేసే ప్రతి బస్సు ఈ హైవే బస్టాండ్ వద్ద ఆగుతుందని దీనివల్ల పట్టణ ప్రజలకు ప్రయాణ భారం తగ్గుతుందని చెప్పారు. ఇక్కడే ఎలక్ట్రికల్ బస్సులకు చార్జింగ్ పాయింట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హైవే పై బస్టాండ్ ఉండటంవల్ల జగ్గయ్యపేట పట్టణం వ్యాపారపరంగా, పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రి బాయి పూలేకు నివాళులు

విశాలాంధ్ర-తిరువూరు: సావిత్రి బాయి పూలేకు నివాళులు దేశ తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రి బాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక గ్రంథాలయంలో ఆదివారం ఆమె చిత్ర పటానికి పాఠకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యాభివృద్ధికి ఆమె చేసిన సేవలను కొనియాడారు.కార్యక్రమంలో ప్రథమ శ్రేణి గ్రంథాలయ అధికారిణి కె.పద్మావతి, ఆంగ్ల భాష ఉపాధ్యాయ సంఘు కన్వీనర్ యం.రాం ప్రదీప్, సిబ్బంది వి.జ్యోతిర్మయి, టి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భవనాలు ప్రారంభించిన ఎంపీ నాని

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శ్రీనివాస్(నాని) పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలో నూతనంగా నిర్మించిన పలు భవనాలను ఆయన స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులతో కలసి ప్రారంభించారు. తొలుత మండలంలోని తెల్లదేవరపల్లి, పుట్రేల శివారు రామానగరం గ్రామాల్లో రూ.1.76కోట్ల వ్యయంతో నిర్మించిన విలేజ్‌క్లినిక్, రైతుభరోసా కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం వేమిరెడ్డిపల్లి పంచాయతీలో రూ.47లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సహకారసంఘం భవనాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తాతినేని పద్మావతి, తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాస్, తిరువూరు ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు బీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పి.మెర్సీ వనజాక్షి, డీసీసీబీ డైరక్టర్ భూక్యా రాణి, ఆయా గ్రామాల సర్పంచులు రాయల నాగరాణి, కారుమంచి స్వాతి, పంతంగి విజయకుమారి, స్థానికులు పాల్గొన్నారు.

పాడి, పశు సంపద లక్ష్యం : సామినేని

విశాలాంధ్ర-నందిగామ: గ్రామీణ ప్రాంతంలో పాడి, పశు సంపద లక్ష్యంగా కృషి చేయాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు, మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నందిగామ మండలం దాములూరు కూడలి శ్రీ సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం ఆలయ కమిటీ రైతు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పశు ప్రదర్శన నిర్వహించారు, ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఎడ్లపూటీలాగుడు పోటీలను సామినేని ప్రారంభించారు, 18 జతలు పాల్గొన్న న్యూ జూనియర్ గిత్తల విభాగంలో ఆరుగురు మనుషులు ఒక క్వింటా 50 కేజీల బరువుతో ఎనిమిది నిమిషాల వ్యవధిలో ఎద్దుల పోటీలాగుడు పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి, ఆలయ కమిటీ చైర్మన్ కనగాల వెంకటేశ్వర రావు,కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్,రైతు కమిటీ సభ్యులు కొలకలూరి వెంకటేశ్వరరావు,చెరుకూరు రమేష్,మేడా కోటేశ్వరరావు,గుత్తా శివాజీ, ఈదర వెంకట్రావు, దేవినేని రామారావు, కొల్లూరు ఉమామహేశ్వరరావు, కనగాల రాంబాబు, ఈదర నరసింహారావు, వెంకయ్య, పర్యవేక్షణ లో జరుగుతున్న ఎడ్ల పూటీ లాగుడు ప్రదర్శనలనుతెలుగు ఉభయ రాష్ట్రాల ప్రాంతాలలోని పలు గ్రామాల నుండి తరలివచ్చారు.

ఆర్థిక సుస్థిరత సామాజిక అభివృద్ధి లక్ష్యం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రంలో ఆర్థిక సుస్థిరత సామాజిక అభివృద్ధి సాధించటమే తమ లక్ష్యంగా తమ మేనిఫెస్టోని రూపొందించామని థర్డ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు దేవరపల్లి మహేష్ తెలిపారు. అదివారం గాంధీనగర్లఓని ప్రెస్‌క్లబ్‌లో ది గ్రేట్ మేనిఫెస్టోని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వొట్టి మాటలు కట్టిపెట్టి గట్టి మేల్ తలపెట్టమని ఒక మహాకవి అన్నారని దానిని అదర్శంగా తీసుకుని తమ మానిఫెస్టోను ప్రజా ప్రయోజనాలు నెరవేర్చే విధంగా రూపొందించామన్నారు. వ్యవసాయ రంగంలో పెట్టుబడులకు లైఫ్ టైం 12 సంవత్సరాల వరకు చట్టబద్ధత.వ్యవసాయ రంగ ఉత్పత్తులకు లాభ సాటి చట్టబద్ధ ధర. కామన్ మార్కెట్ లేబర్ మార్కెట్ తో నిత్యవసర సరుకుల ధరలు రెండు సంవత్సరాల వరకు పెరగకుండా ఉండేందుకు చట్టం. ప్రభుత్వ ఉద్యోగులు ప్రైవేటు ఉద్యోగులకు ప్రతి మూడు సంవత్సరాలకీ ఒక సారి జీతాల పెంపు. ప్రజా ప్రతినిధిగా, కుల బంధు ప్రీతి లేకుండా ప్రజలందరికీ సేవ విధంగా క్యాస్ట్ ఫీలింగ్ చట్టం. గ్రామాలలో పదో తరగతి నుండి మండలాలలో పీజీ స్థాయి వరకు ఉన్నతమైన విద్యను కల్పిస్తూ, స్థానిక విద్యాలయాల్లో చదువులు స్థానికులకే ఉద్యోగాలు.. కల్పించే విధంగా,విలేజ్ టు మండల స్థాయి విద్యా విధానం తీసుకువస్తామని ఆయన అన్నారు. ఎంతోమంది మద్యానికి బానిసలై నేరాలు ఘోరాలు చేస్తూ, మద్యం మత్తులో డ్రైవింగ్ చేసి ప్రమాదాలు చేస్తూ ప్రమాదాలకు గురై చనిపోతూ, మద్యం వల్ల ప్రజలందరూ ప్రత్యక్షంగానో పరోక్షంగానో బాధలు పడుతున్న తక్షణ అవసరాన్ని గుర్తించి, తీసుకువచ్చిందే ఈ మద్యపాన ఉపశమన పాలసీ సిస్టం అన్నారు.

దళితులను దగా చేసిన సీఎం జగన్ : సౌమ్య

విశాలాంధ్ర-కంచికచర్ల: దళితుల ఓట్లతో గెలిచి దళితులను పచ్చిగా దగా చేసిన ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కాదా అని మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆరోపించారు. తంగిరాల సౌమ్య సౌజన్యంతో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు ఆధ్వర్యంలో కంచికచర్ల మండల పరిధిలోని, మన పల్లెకు మన సౌమ్య దళితుడా మేలుకో,అనే కార్యక్రమాన్ని ఆదివారం బత్తిన పాడు,చెవిటికల్లు దళిత నేతలతో కలిసి దళిత వాడల్లో తంగిరాల సౌమ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమం లో తంగిరాల సౌమ్యకు దళిత నేతలు దళిత మహిళలు పెద్ద ఎత్తున పల్లెల్లో ఘన స్వాగతలతో పాటు పూల వర్షాలు కురిపించారు.అనంతరం వారితో సౌమ్య సహబంతి భోజనం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ తెలుగుదేశం జనసేన ఉమ్మడి పార్టీ అభ్యర్థి తంగిరాల సౌమ్య మాట్లాడు తూ గత తెలుగుదేశం హయాంలో దళితులకు నారా చంద్రబాబు నాయుడు దళితులు వారి స్వశక్తి మీద బ్రతికేందుకు ఎస్సీ కార్పొరేషన్ స్థాపించి వాటి ద్వారా వేలకోట్ల సబ్సిడీ రుణాలను అందించడమే కాక వీరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపా రన్నారు.నేడు ఈ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి దళిత ఓట్లతో గద్దెనెక్కి దళితులకు రావాల్సి న అనేక రాయితీ రుణాలను కాలరాచారన్నారు. ఈ కార్యక్రమంలో కోగంటి బాబు, మాదాసు సురేషు, జయరాజు, వెలగలేటి బుద్దయ్య, ఎలమంద,పలువురు దళిత, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్లకోమా అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-విజయవాడ : ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు పురస్కరించుకుని ఎల్వీపీఈఐ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. విజయవాడ కోడి వెంకటాద్రి చౌదరి ప్రాంగణం వద్ద ర్యాలీ ప్రారంభించిన అనంతరం డాక్టర్ మయంకా రాయ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడ ప్రచారాలు, చర్చలు, రోగుల పరస్పర కలయికలు నిర్వహించటం ద్వారా గ్లకోమాను ముందస్తుగా గుర్తించి నివారించుట గురించి ప్రజలకు అవగాహన కల్పించుటకు విజయవాడలోని ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల (ఎల్వీపీఈఐ) మార్చి 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు పాటిస్తున్నట్టు తెలిపారు. గ్లకోమా అనేది కంటి ఒత్తిడి సంబంధిత దృష్టి లోపం కలిగించు వ్యాధి అని, కొన్ని రకాల వ్యాధులకు దీర్ఘకాలం పాటు స్టెరాయిడ్స్ వాడకం వలన కంటి లోపల ఒత్తిడి పెరిగి, దృష్టి లోపంనకు దారి తీస్తుందన్నారు. 2040 నాటికి గ్లాకోమా వ్యాధితో బాధపడేవారి సంఖ్య 76 మిలియన్ల నుండి 111.8 మిలియన్లకు పెరగవచ్చునని అంచనా ఉందన్నారు. ఈ ఏడాది వారోత్సవాలు "స్టెరాయిడ్ ప్రేరిత గ్లకోమా "అనే అంశం పైన దృష్టి సారిస్తున్నారన్నారు. ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల (ఎల్వీపీఈఐ) నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం 4062 మంది పిల్లలలో 2.2 శాతం మంది స్టెరాయిడ్ ప్రేరిత గ్లకోమా కలిగి ఉన్నట్లు తెలిపారు. అలాంటి వారిలో 30 శాతం మంది అంధత్వంతో తమ దగ్గరకు వస్తున్నట్లు గుర్తించామన్నారు. ఇలాంటి పిల్లలు చాలామంది ప్రిస్క్రిప్షన్ లేకుండా లేదా సూచించిన కాలం కంటే ఎక్కువ కాలం పాటు స్టెరాయిడ్స్ ఉపయోగిస్తున్నారన్నారు. చుక్కల మందులు, ఆయింట్ మెంట్, ఇన్ హేలర్లు, మాత్రలు ఇంజక్షన్లు వగైరా వాడకం వలన నాన్-ఫార్మాసూటికల్ ఉత్పత్తులు వాడకంలో కూడ స్టెరాయిడ్స్ చేరి ఉంటాయిన్నారు. గ్లకోమాను ముందస్తుగా గుర్తిస్తే అంధత్వం నివారించ వచ్చునని, స్టెరాయిడ్స్ ఉపయోగించు వారు తప్పనిసరిగా క్రమం తప్పకుండా సమగ్ర కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

చిన్న పత్రికలను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చిన్నపత్రిక ప్రోత్సహించి, అవి ఆర్థికంగా నిలదొక్కునేందుకు ప్రభుత్వ ప్రకటనలు ఇచ్చి ఆదుకోవాలని ఏపీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పరిస్థితులలో పత్రికల నిర్వహణ ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్నదని ఆయన అన్నారు. ఆదివారం ఐజేయు కౌన్సిల్ సభ్యుడు ఎస్.కే బాబు అధ్యక్షతన విజయవాడ ప్రెస్ క్లబ్ లో జరిగిన "వేగం" పక్షపత్రిక ఆవిష్కరణ సభలో చందు జనార్ధన్ ముఖ్యఅతిథిగా హాజరై వేగం ను ఆవిష్కరించారు. సభలో స్వామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.రమణారెడ్డి, ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ అధ్యక్షులు చావ రవి, విజయవాడ ప్రెస్ క్లబ్ కార్యదర్శి దాసరి నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే కౌన్సిల్ సభ్యులు దారం వెంకటేశ్వరావు మాట్లాడుతూ చిన్న పత్రికలో అవశ్యకతను,ప్రాధాన్యతను వివరిస్తూ, ప్రత్యేక విశ్లేషణలతో వార్త కథనాలను వేగం పత్రిక ప్రచురించాలని ఉద్బోధించారు.పత్రిక విజయవంతం గా నిర్వహించబడి,మంచి పేరు గడిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.తొలుత వేగం పత్రిక సంపాదకులు షేక్ సిరాజుద్దీన్ యూనియన్ నాయకులను స్వాగతం పలికి వేదికపై ఆహ్వానించారు.మేమెంటోలు, దుశ్శాలువాలతో అతిథులను సత్కరించారు.

డాక్యుమెంట్ పోయినది

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు గ్రామ కాపురస్తులైన నిమ్మగడ్డ పూర్ణచంద్ర s/o (లేటు) నిమ్మగడ్డ సత్యనారాయణ అను నాకు గన్నవరం మండలం అజ్జంపూడి గ్రామంలో సర్వేనెంబర్ 29/5 నందు 74 సెంట్ల భూమి గన్నవరం సబ్ రిజిస్ట్రర్ వారి కార్యాలయం నందు ది.26-9-2018న డాక్యుమెంట్ నెంబర్ 7120/2018గా రిజిస్టర్ అయిఉన్నది సదరు ఒరిజినల్ డాక్యుమెంట్ 2-3-2024వ తేదీన నేను మూలపాడు నుండి ఇబ్రహీంపట్నం వైపు బైక్ మీద వస్తుండగా మార్గమధ్యంలో పోయినది దొరికిన వారు ఈ కింది నెంబర్ కు తెలియజేయగలరు.

9848062529

In the Court of the XII Addl. District Judge at Vijayawada

IA 70/2023 in OS 83/2016

Between :
Yerramaneni Purnachandra Rao - Petitioner/ Plaintiff
Vs
1. P.V. Koteswara Rao, CL Estate Office, Ground Floor, Opp. Autonagar bus stop, Kanuru, Penamaluru Mandal. - R5
2. Ganugapati Venkata Sri Rama Chandra Murthy, S/o. Venkata Subba Rao, D.No : 23-34-12, Laxmi Nagar, SN Puram, Vijayawada-11. - R7
- Resondents 5 & 7

పై నెంబరు ఐ.ఎ.70/2023 పిటిషన్‌లో 5 మరియు 7వ రెస్పాండెంట్స్‌కు ఏమైనా అభ్యంతరములు ఉన్నయెడల ది. 02-04-2024 తేదీ ఉదయం 10.30గం॥లకు పై కోర్టువారి ఎదుట హాజరై తెలువుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానింపబడును.

విజయవాడ, 06-03-2024
బీరం సుబ్బారావు, పిటిషనర్ తరఫు అడ్వకేట్ విజయవాడ

In the Court of the Prinicipal Civil Judge (Junior Division) at Vijayawada

E.P.No.132/19 in ACP No : 179/2017

Between :
M/s. Shriram Chits (P) Ltd, One town Branch, Vijayawada - DHR
And
K. Ramya sri & Other - JDR's
To :
JDR 5 : K. Soloman, S/o. Sangeetha Rao, Hindu, aged about 33 years, Designation: Employee in South Central Railway, Vijayawada. Resident of : D.No: 43-106/2-58, 4/5, 9th line, Tholavari street, Nandamuri Nagar, Vijayawada.

పై నెంబరు ఇ.పి.లో డి.హెచ్.ఆర్. కంపెనీ వారు జెడిఆర్ 5పై డిక్రీ బాకీనీ ఖర్చులతో రాబట్టుకొనుటకు ఆర్ 21 రూల్ 48 సి.పి.సి. ప్రకారం దాఖలు చేయగా అందుపై ఇ.పి.లో 5వ జెడిఆర్‌కు ఆర్ 21 రూల్ 48 సి.పి.సి. ప్రకారం నోటీసుల నిమిత్తం ది. 24-4-2024నకు శ్రీ కోర్టువారు వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం గం. 10.30ని॥లకు 5వ జెడిఆర్‌పై కోర్టువారి ఎదుట స్వయంగాగాని న్యాయవాది ద్వారాగాని హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల శ్రీ కోర్టువారిచే మీ పరోక్షముగా విచారించి తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియపర్చడమైనది.

వాయిదా తేది : 24-4-2024
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)

వేమూరి రవిశంకర్, అడ్వకేట్, విజయవాడ.

ఇంద్రకీలాద్రిపై ఫైర్ ఇంజన్ బ్రేక్ ఫెయిల్

డ్రైవర్ అప్రమత్తతో తప్పిన పెను ముప్పు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డులో ఫైర్ ఇంజన్ బ్రేక్ అయింది. డ్రైవర్ అప్రమత్తతో పెను ముప్పు తప్పింది. ఈ ఘటన ఆదివారం విజయవాడ ఇంద్రకీలాద్రి పై చోటుచేసుకుంది. ఇంద్రకీలాద్రి ఘాట్ సమీపంలో స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. దానిని ఆర్పేందుకు ఫైర్ ఇంజన్ ఘాట్ రోడ్డులో వెళ్లి మంటలను అదుపులోకి తెచ్చింది. ఈ లోపు ఫైర్ ఇంజన్ బ్రేగ్ ఫెయిల్ అవ్వడంతో వెంటనే డ్రైవర్ అప్రమత్తంతో కొండ పై తిప్పిడంతో ఢీకొన్ని ఫైర్ ఇంజన్ అగింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు.

జూనియర్ కాలేజీ కాంటాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

విశాలాంధ్ర-విజయవాడ: జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే క్రమబద్దీకరిస్తూ ఉత్తర్వులు విడుదల చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి కాంటాక్ట్ లెక్చరర్ల సంఘం నాయకులు గార్ల మాణిక్యం, కామాల శేషగిరి విజ్ఞప్తి చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటికే వైద్య ఆరోగ్య ట్రైబల్ వెల్ఫేర్ శాఖలో రెగ్యులరైజ్ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. జూనియర్ కాలేజీలలో ఏ ఒక్కరికి ఉత్తర్వులు ఇంకా విడుదల చేయకపోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు ఇంటర్ పరీక్షలు ఒత్తిడి మరోవైపు ఎలక్షన్ కోడ్ ఒత్తిడిలో సతమతమైపోతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నేతల శ్యామ్ కిరణ్, పరస వేణమ్మ, ఎం నిర్మల, శివాజీ, దేవానందం, రాజు తదితరులు పాల్గొన్నారు.

సుందరంగా ఉద్యానవనం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలుగ్రామ పంచాయతీ అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుంది. సర్పంచ్ వేల్పుల పద్మకుమారి ఆధ్వర్యంలో, పెనుగంచిప్రోలు గ్రామపంచాయతీని సుందర నందనవనంగా తీర్చిదిద్దారు. గ్రామానికి ముఖద్వారమైన పెనుగంచిప్రోలు అలుగు వాగు వద్ద, ఒక అద్భుతమైన పార్కు నిర్మాణం చేశారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సతీమణి విమలపేరుతో, ఒక సుందర ఉద్యానవనంగా ఏర్పాటు చేశారు. త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానుందని సర్పంచ్ తెలిపారు.

మహిళా ఎస్ఐ, కానిస్టేబుళ్లు, హోంగార్డులకు సన్మానం

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విజయవాడ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న మహిళా సిబ్బందికి సీఐ గణేష్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం ఆదివారం స్టేషన్ ప్రాంగణంలో జరిగింది. మహిళా ఎస్సై, కానిస్టేబుళ్లు, హోంగార్డులకు హ్యాండ్ వాచీలతో పాటు చీరలు ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించే విధంగా ప్రోత్సహించాలన్నారు. ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా భారత రాజ్యాంగంలో మహిళలకు సమాన హక్కులు కల్పించబడ్డాయన్నారు. దేశ రక్షణలో పురుషులతో పాటు మహిళలు పాలుపంచుకుంటున్నారని, విమానయం, పర్వతారోహణలోనూ.పోలీసుశాఖ. ఇలా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజానరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర-విజయవాడ: విజయవాడ అర్బన్ పరిధిలో అర్హులైన వారికి నివాస స్థలాలపై పూర్తి హక్కులు కల్పిస్తూ పత్రాలు అందించడంతో పాటు వివిధ అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి ప్రారంభించనున్న నేపథ్యంలో సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఎస్.డిల్లీరావు ఆదేశించారు. ఈ నెల 12 లేదా 13న ముఖ్యమంత్రి విజయవాడ పర్యటన నేపథ్యంలో కలెక్టర్ ఎస్.డిల్లీరావు విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా, జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, విజయవాడ ఆర్‌డీవో బీహెచ్ భవానీ శంకర్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శనివారం అజిత్ సింగ్ నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంను సందర్శించారు. సభా వేదిక ఏర్పాటు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల పార్కింగ్, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరక్కుండా భద్రతా ఏర్పాట్లు, కార్యక్రమానికి హాజరయ్యే లబ్ధిదారులు, ప్రజలు తదితరులకు వేసవి నేపథ్యంలో ప్రత్యేకంగా తీసుకోవాల్సిన చర్యలు, సభాస్థలి ప్రాంగణంలో చేయాల్సిన ఏర్పాట్లు తదితరాలపై చర్చించారు. ముఖ్యమంత్రి సభాస్థలికి వచ్చే మార్గం, తిరిగి వెళ్లే మార్గాలను కూడా పరిశీలించారు. రెవెన్యూ, పోలీస్, విద్యుత్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశనం చేశారు. సీఎం చేతులమీదుగా కృష్ణా కరకట్ట రెండు, మూడో దశల రక్షణ గోడలతో పాటు రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని కూడా కలెక్టర్ డిల్లీరావు.. సీపీ కాంతి రాణా టాటా, జేసీ పి.సంపత్ కుమార్ తదితరులతో కలిసి పరిశీలించారు. కృష్ణలంక, రాణిగారితోట ప్రాంతాన్ని సందర్శించి.. రిటైనింగ్ వాల్స్‌తో పాటు విజయవాడ నగర పాలక సంస్థ చేపడుతున్న పార్కు, సుందరీకరణ పనులను పరిశీలించారు. పనుల సత్వర పూర్తికి సూచనలు చేశారు.

టీడీపీ హయాంలో బీసీల అభివృద్ధి

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : పట్టణంలో శుభమస్తు ఫంక్షన్ హాల్ నందు "జయహో బీసి - జయహో తాతయ్య"."చేయి చేయి కలుపు దాం - తాతయ్యను గెలిపిద్దాం" జగ్గయ్యపేట నియోజకవర్గ బీ.సీ ల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విజయవాడ పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం శ్రీ రఘురామ్, టిడిపి జాతీయ కోశాధికారి,జగ్గయ్యపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), రాష్ట్ర బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి, జగ్గయ్యపేట నియోజకవర్గ పరిశీలకులు, బీసీ నాయకులు దొంతు చిన్న, రాష్ట్ర బీసీ సెల్ నాయకురాలు యలగాల నూకాలమ్మ, జగ్గయ్యపేట మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి బాడిశ మురళీకృష్ణ మరియు వివిధ హెూదాలలో ఉన్న బీసీ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ బీసీలు అంటే బ్యాక్ వర్డ్ క్లాసెస్ కాదు.... బ్యాక్ బోన్ క్లాస్సెస్ అని అన్నారు. టిడిపి ప్రభుత్వ హయంలోనే బీసీలు అన్ని విధాల అభివృద్ధి చెందారని అన్నారు. టిడిపి ప్రభుత్వ హయంలో నారా చంద్రబాబునాయుడు ఆదరణ పథకంతో బీసీలను అన్ని విధాల ఆదుకోవడం జరిగిందన్నారు. 90 శాతం సబ్సిడీతో లబ్ధిదారులకు పరికరాలు 125 కులాలకు ఆర్థిక సాయం తెలుగుదేశం ప్రభుత్వం లోనే జరిగిందన్నారు. బీసీలకు రూ 75 వేల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పిన జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఐదు సంవత్సరములు పూర్తవుతున్నప్పటికీ బీసీలకు ఒక్క రూపాయి అయినా జగన్ ఇచ్చారా అని ప్రశ్నించారు గత తెలుగుదేశం ప్రభుత్వంలో 34 శాతం ఉన్న స్థానిక సంస్థల రిజర్వేషన్లు వైసిపి ప్రభుత్వం రాగానే 24 శాతానికి తగ్గించారని అన్నారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను రద్దు చేశారన్నారు కనీసం బీసీ భవనాలను కూడా పూర్తి చేయలేకపోయారు అన్నారు బీసీలకు ఏం చేశారని వైసీపీ నేతలు సాధికార యాత్ర చేపడుతున్నారని అన్నారు ప్రతి ఒక్కరి ఆదాయం పెరిగితేనే నిజమైన అభివృద్ధి అని అన్నారు టిడిపి పాలనలో బీసీలకు ఎంత మేలు జరిగిందో, వైసీపీ పాలనలో బీసీలు ఏం కోల్పోయారో ప్రజలకు వివరించారు.మంగళగిరిలో జరిగిన జయహో బీసీ సభలో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు గారు మరియు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ఆనందదాయకమన్నారు.తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన నుండి బీసీలకు అండగా ఉన్న పార్టీ తెలుగు దేశం పార్టీ మాత్రమేనని,తమ అధినేత పేర్కొన్న విధంగా బీసీల డీఎన్ఏలోనే తెలుగుదేశం పార్టీ ఉందన్న మాట అక్షర సత్యం అని అన్నారు. బీసీ నేతలను ఎందరినో ప్రోత్సహించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు.బీసీ సబ్ ప్లాన్ కోసం ఏటా నిధులు కేటాయింపు చేస్తామని చెప్పడం, లక్షన్నర కోట్ల రూపాయలతో నిధులను కేటాయించి వారి ఉన్నతికి శ్రీకారం దిద్దుతామని చెప్పడం హర్షణీయం అని అన్నారు. బీసీలకు యాభై ఏళ్లకే నెలకు నాలుగు వేల రూపాయల పింఛను ఇస్తామని చెప్పడం,అలానే వారి కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకుని వస్తామని ప్రకటించడం చంద్రబాబు విజన్ కు తార్కాణమని అన్నారు. అలానే బీసీ రిజర్వేషన్లను 34 శాతం అమలు చేస్తామని,స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి అమలు చేసిన అనాలోచిత నిర్ణయం వైసీపీ ప్రభుత్వానిదే అని విమర్శించారు. చట్ట సభలలో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పడం ఎంతో మంచి నిర్ణయమని అన్నారు.గతంలో పాలకులు ఎవ్వరూ ఈ విధంగా ఆలోచించలేదన్నారు. బీసీలకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తామని, గతంలో ఉన్న విధంగా ఉపాధి ప్రోత్సాహకాలు పునరుద్ధరిస్తామని చెప్పడం, అందుకు తగ్గ ప్రణాళికను ప్రకటించడం తెలుగుదేశం పార్టీ నిబద్ధతకు తార్కాణం అని తెలిపారు. చట్టం ప్రకారం కుల గణన నిర్వహిస్తామని, పది లక్షల రూపాయల చంద్రన్న బీమా, లక్ష రూపాయలు పెళ్లి కానుక అందిస్తామని, శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, నాయకులు పాల్గొన్నారు.

చేనేతను కాపాడుకుందాం : బండారు

విశాలాంధ్ర-పెడన : కనుమరుగైపోతున్న చేనేతను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆలిండియా వీవర్స్ జాతియ అధ్యక్షులు బండారు ఆనంద్ ప్రసాద్ అన్నారు. పెడన పట్టణం పడమట వీధిలోని విఘ్నేశ్వర ప్రార్థన మందిరంలో ఆదివారం ఆలిండియా వీవర్స్ కృష్ణాజిల్లా శాఖ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం రాష్ట్ర అధ్యక్షులు ఇనమాల శివరాం ప్రసాద్ అధ్యక్షతన జరిగినది. కృష్ణాజిల్లా శాఖ కార్యవర్గ సభ్యులకు శ్రీశైలం, తిరుపతి నిత్యాన్నదాన దేవాంగ సత్రముల అధ్యక్షులు బొమ్మన దుర్గా ప్రసాద్ నియామక పత్రాలు అందచేశారు. జాతీయ గౌరవ అధ్యక్షులు నక్కిన చిన వెంకట్రాయుడు కార్యవర్గ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు.కృష్ణాజిల్లా శాఖ అధ్యక్షులుగా పిచ్చుక ఫణి కుమార్,ప్రధాన కార్యదర్శిగా ఆకురాతిజనార్ధనరావు,కోశాధికారిగా తాళ్ళ బాలాజీ మరియు జిల్లా వ్యాప్తంగా వున్న అన్ని చేనేత ప్రాంతాల నుండి 5 గురు గౌరవ అధ్యక్షులు, 5 గురు గౌరవ సలహాదారులు, 9 మంది ఉపాధ్యక్షులు, 9 మంది కార్యదర్శులు, 5 గరు మహిళా కార్యదర్శులు, 9 మంది సంయుక్త కార్యదర్శులు, 9 మంది కార్యవర్గ సభ్యులతో కృష్ణాజిల్లాశాఖనుఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆనంద్ ప్రసాద్మాట్లాడుతూచేనేతకళఅత్యంతప్రాచీనమైనదని, నరులను నగ్నత్వం నుండి రక్షించి మానమర్యాదలను కాపాడిన జాతి మన చేనేత జాతి అనీ, మన పూర్వీకులు మహాచక్రవర్తులచే సన్మాన, సత్కారాలతో గౌరవింపబడ్డారనీ తెలిపారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి, ప్రజాస్వామ్యబద్ధంగా ఆప్కో సంస్థకు పాలకవర్గాన్ని ఏర్పాటుచేసి ఆప్కో సంస్థకు సర్వస్వతంత్ర వ్యవస్థగా స్వేచ్ఛనివ్వాలనీ. ఆప్కో సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తూ, ఆప్కో విక్రయశాలల నిర్వహణ మరియు పనితీరులను మెరుగుపరిచే విధంగా తగుచర్యలు తీసుకుని, చేనేత సహకార సంఘాలు ఉత్పత్తిచేసిన చేనేత వస్త్రాలను ఎప్పటికప్పుడు కొనుగోలుచేస్తూ కళాకారులకు పని కల్పించాలనీ మరియు కొనుగోలుచేసిన వస్త్రాల బకాయిలను తక్షణం చెల్లిస్తూ చేనేత సహకార సంఘాలను ఆదుకోవాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం సగటు చేనేత కార్మికుని మెరుగైన జీవనవిధానానికి ఉపయోగకరంగా ఉన్నపటికీ, చేనేత వృత్తి పరిరక్షణకు, చేనేత సహకార సంఘాలకు ఆయువుపట్టు వంటి ప్రభుత్వ పథకాలైన పావలా వడ్డీ పథకం, రిబేటు పథకం, నూలుపై సబ్సిడీ పథకం, త్రిఫ్ట్ ఫండ్ పథకం, మార్కెటింగ్ ఇన్సెంటివ్ (ఐహెచ్డీస్) పథకాలను కొనసాగిస్తూ చేనేత సహకార సంఘాలకు ఇవ్వవలసిన పెండింగ్ బకాయిలను ప్రభుత్వం చెల్లించాలనీఅన్నారు.చేనేతలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోతేఐక్యంగా చేనేతలు తగిన విధంగాస్పందిస్తారని, చేనేత ఆత్మగౌరవ సాధికార ఉద్యమంలో సమస్త చేనేతలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోరాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోశాధికారి గుంటుకు చంద్ర శేఖర్ తెలంగాణ రాష్ట్ర శాఖ కోశాధికారిగవ్వలశెంకర్,పిల్లలమర్రినాగేశ్వరరావు(ఉపాధ్యక్షులు) వాసా పల్లపు రాజు, (రాష్ట్ర కర్ణభక్త సంఘం అధ్యక్షులు), కట్టా హేమసుందర్ రావు (గౌరవ అధ్యక్షులు), రాష్ట్ర కార్యదర్శి కర్ర రవి , రాష్ట్ర దేవంగ సంక్షేమ సంఘం మహిళా విభాగ రాష్ట్ర ప్రధాకార్యదర్శి వుప్పుగంటి రాజేశ్వరి, నరసాపురం దేవంగ సంఘం ప్రధానకార్య దర్శి అల్లంకి నాగేశ్వర రావు, పెర్నేటి రాంప్రసాద్, యర్రా శ్రీనివాస రావు, పడవల మోహన త్రినాథ్, కృష్ణాజిల్లా ఇన్చార్జి కాలెపు సూరిబాబు, ఆశవు సముద్రేశ్వర రావు, బళ్ళ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు

సమస్యలు పరిష్కరిస్తాం : కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : తెలుగుదేశం జనసేన ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్రకు అడుగడుగునా నీరాజనం, అక్కున చేర్చుకుంటున్న బందరు ప్రజానీకం. ఆదివారంమచిలీపట్నం మండల పరిధిలోని మేకవానిపాలెం శ్రీనివాస్ నగర్, గోపువానిపాలెంలో పర్యటించిన మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ళ నారాయణ, జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ బండి రామకృష్ణ, రాష్ట్ర బీసీ నాయకులు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొనకళ్ళ బుల్లయ్య, మరియు తెలుగుదేశం జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు. వీరికి తమ సమస్యలపై ఏకరువు పెట్టిన నవీన్ మిట్టల్ కాలనీ, శ్రీనివాస్ నగర్ ప్రజలు.ఈ ప్రభుత్వంలో కనీసం మంచినీరు తాగడానికి ఎంత ఇబ్బందులు పడుతున్నారో కన్నీరు పెట్టుకొని కొల్లు రవీంద్రకు సమస్యను వివరించారు.వైసీపీ ప్రభుత్వం కేవలం తమ పబ్బం గడుపుకోవడమే తప్ప ప్రజా సమస్యలపై కనీసం దృష్టి పెట్టడం లేదని వాపోయారు. తెలుగుదేశం జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి, నీరు ఇచ్చే బాధ్యత తీసుకుంటామని కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం నవీన్ మిట్టల్ కాలనీ శ్రీనివాస్ నగర్, మేకవాని కాలనీ, గొపువాని పాలెంలో పర్యటించిన మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి బండి రామకృష్ణ, జనసేన, తెలుగుదేశం పార్టీ నాయకులు.

సేవతోనే ఏసుకృపకు పాత్రులం : గద్దె

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : తనను నిత్యం స్మరించుకుని, తనకు పూజలు చేసే వారికంటే కూడా తోటి వారికి సాయం చేసే వారికే తన దీవెనలు ఉంటాయని ఏసుక్రీస్తు బోధనలు తెలియజేస్తున్నాయని, ఆ రీత్యానే తనకు ఎంతో మందికి సేవచేసే అవకాశం కలిగిందని అందుకు ఏసు కృపే కారణమని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌రావు పేర్కొన్నారు. స్థానిక కృష్ణలంక బేతస్త మినిస్ట్రీస్ చర్చిలో ఆదివారం జరిగిన ప్రార్ధన కార్యక్రమాల్లో ఎమ్మెల్యేతో పాటు విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని చిన్నీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తోటివారికి సహాయం చేయటం, పొరుగువారికి సహకరించటం ద్వారానే తనను ఆరాదించాలని బైబిల్ తెలియజేస్తుందన్నారు. తనాడు 1994లో ఒక సినియాలో ఏసుక్రీస్తు పాత్రలో నటించటం జరిగిందని, ఆ సందర్భంలో ఏసు గొప్పతనం, ఆయన చూపిన మార్గాలను తెలుసుకుని అప్పటి నుంచి సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. తనకు ఇంతటి అవకాశం కల్పించిన పాస్టర్‌కు, దైవజనులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయలక్ష్మి, జోహార్, రంగారావు, నాగేశ్వరరావు, భావన్నారాయణ, చందన సురేష్, చిన్నా, రమేష్ పాల్గొన్నారు.

వీఎంసీలో నేడు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నేడు నగర పాలక సంస్థలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఏపీసీఓఎస్ ద్వారా వివిధ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ ఫుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 19వ తేదీన పత్రికా ప్రకటన ద్వారా తెలిపిన పోస్టులకు ఈనెల 11వ తేదీన ఆయా ప్రదేశాల్లో ఇంటర్వ్యూలు, సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రం ఎదురుగా ఉన్న పాత ప్రభుత్వ ఆసుపత్రి, గవర్నర్‌పేట ఆంధ్రా ఆసుపత్రి వద్ద ఉన్న ఐవీ ప్యాలెస్, సత్యనారాయణపురంలోని ఏకేటీపీఎంసీహెచ్ స్కూల్ వద్ద ఉన్న వీఎంసీ సర్కిల్-2 కార్యాలయం, బందరు రోడ్డులోని దండమూడి రాజగోపాల్ ఇండోర్ స్టేడియం వద్ద ఇంటర్వ్యూలు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. కాల్ లెటర్లులో అభ్యర్థులకు తెలిపిన ప్రదేశాల్లో, వారికి కేటాయించిన సమయానికి కాల్ లెటర్‌తో పాటు అడ్రస్, ధృవీకరణ పత్రాలు, అర్హత పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు.

పాలిక్యాబ్ మాక్సిమా ప్లస్ గ్రీన్ వైర్ కోసం కొత్త టీవీసీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్) : ప్రముఖ ఎలక్ట్రికల్ గూడ్స్ కంపెనీ పాలిక్యాబ్ ఇండియా, దక్షిణాది మార్కెట్ కోసం రూపొందించిన పాలిక్యాబ్ మాక్సిమా ప్లస్ గ్రీన్ వైర్‌ను ప్రదర్శించేందుకు ఎక్స్‌ట్రా సేఫ్ పాలిక్యాబ్ మాక్సిమా ప్లస్ కోసం తమ సరికొత్త టీవీసీని విడుదల చేసినట్లు ప్రకటించింది. ఈ ప్రచారం ద్వారా, పాలిక్యాబ్ ఆవిష్కరణ, కస్టమర్ భద్రత పట్ల తమ అంకితభావాన్ని పునరుద్ఘాటిస్తుంది. ఈ టీవీసీ కలల ఇంటికి సరైన వైరింగ్‌ను ఎంచుకోవడం యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పడానికి ఆధునిక భద్రతా చర్యలతో సాంప్రదాయ ఆచారాలను మిళితం చేస్తుంది.

నాణ్యమైన విద్య లక్ష్యం

విశాలాంధ్ర - విజయవాడ లబ్బీపేట : గుజరాత్ రాష్ట్రం రాజ్ కోట్ కు చెందిన మార్వాడి యూనివర్సిటీ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయాన్ని విజయవాడలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మార్వాడి యూనివర్సిటీ ట్రస్టీ ధ్రువ్ మార్వాడి పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో మార్వాడి యూనివర్సిటీ ప్రాంతీయ కార్యాలయాలు ప్రారంభిస్తామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య మంచి ప్లేస్మెంట్స్ అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ధ్రువ్ మార్వాడి తెలియజేశారు. ఛీఫ్ గెస్ట్ మార్వడి డాక్టర్ మృణాల్ 12 వేల మంది పైగ శిక్షణ ఎప్లస్ గవర్నమెంట్ ఆఫ్ గుజరాత్ టాఫ్ 5వరల్డ్ క్లాస్ ప్రపంచ స్థాయిలో ఫ్యాకల్టీ ఉందన్నారు. విధ్యార్థులకు యోగ కూడ నెర్పిస్తున్నామన్నారు. 80శాతం జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్లేస్ మేంట్ సాధించామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ,తెలంగాణలో విజయవాడలో యునివర్సిటి ప్రాంతీయ ఆఫీసు ఏర్పాటు చేశామన్నారు.గుజరాత్ లో ఏర్పాటు చేశామన్నారు. నాణ్యమైన విధ్య అందించడంలో మార్వడి గ్రూప్ ముందుంటారని అన్నారు. మంచి ఆహరం ,ఎడ్యుకేషన్, ఇఫ్రా స్ట్రేక్చర్ ఉందన్నారు.మార్వడి యునివర్సిటి యునివర్సిటి సందర్శించాలని కోరారు.అక్షర ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో మార్వడి యునివర్సిటి ఆంధ్ర తెలంగాణ క్వాలిటి ఎడ్యుకేషన్ కోరుకుంటారని అన్నారు.5 స్టార్ రేటింగ్ తో ఇన్ఫ్రాస్ట్రేక్చర్ దేశంలో మంచి పేరు తెచ్చుకుందన్నారు.53 దేశాల్లో మార్వడి గ్రూప్ లు ఉన్నాయన్నారు.నాణ్యమైన ట్రెనింగ్ ఫ్యాకల్టీ కలిగి ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మార్వాడి యూనివర్సిటీ రీజనల్ కోఆర్డినేటర్ కన్యాపురి శ్రీనివాసులు ఆధ్వర్యంలో అన్ని ప్రాంతాల నుండి ఎడ్యుకేషన్ కన్సల్టెంట్స్ విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

13న ఎల్ఐసీ మెగా బిజినెస్ డే

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఎల్ఐసిలో నూతన వ్యాపార అభివృద్ధికి ప్రోత్సాహాన్ని అందించడంలో భాగంగా, నా ఎల్ఐసి -నాకు గర్వకారణం అనే నినాదంతో ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) మార్చి 13వ తేదీన 'మెగా బిజినెస్ డే' ను పాటించాలని దేశవ్యాప్తంగా పిలుపునివ్వడం జరిగిందని, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్, సంయుక్త కార్యదర్శి చిలకలపూడి కళాధర్ తెలిఆరు. "మెగా బిజినెస్ డే"ను జయప్రదం చేయడంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఏజెంట్ మిత్రులకు ఫోన్ చేసి నూతన వ్యాపారాన్ని సేకరించేలా ప్రోత్సహించడం, ఏజెంట్స్ మీటింగ్స్ నిర్వహించడం, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులను నూతన పాలసీలు తీసుకునేలా సంప్రదించడం, గోడపత్రిక ఆవిష్కరణ, కరపత్రాల పంపిణీ వంటి ప్రచార కార్యక్రమాలను దేశ వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతోందని వివరించారు. ఎల్ఐసి ఇటీవల నూతనంగా ప్రవేశపెట్టిన ధనవృద్ధి, జీవన్ ఉత్సవ్, జీవన్ కిరణ్, అమృత్ బాల్, ఇండెక్స్ ప్లస్ వంటి నూతన పథకాలను గురించి ప్రజానీకంలో విస్తృతంగా ప్రచారం చేపట్టడం జరుగుతోందని, ప్రజల పొదుపును సురక్షితమైన, నమ్మకమైన ప్రభుత్వరంగ ఎల్ఐసి పథకాలలో పెట్టుబడి పెట్టవలసినదిగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నామని తెలియచేశారు. ఎల్.ఐ.సి నూతనంగా ప్రవేశపెట్టిన పథకాలు అన్ని వర్గాల ప్రజానీకానికి అందుబాటులో, ఆకర్షణీయంగా ఉండడంవలన ఇప్పటికే వీటికి మంచి ప్రజాదరణ లభిస్తోందని ఈ నేపథ్యంలో మెగా బిజినెస్ కు అపూర్వ స్పందన లభిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. డివిజన్ నాయకులు ఎన్.ఎమ్.కె.ప్రసాద్, ఎస్.కె.రహీముద్దీన్ మాట్లాడుతూ మచిలీపట్నం డివిజన్ గా 5000-పాలసీలను 13వ తేదీ ఒక్క రోజులోనే సేకరించడానికి జరుగుతున్న ఈ ప్రయత్నానికి పాలసీదారులు, ఏజెంట్ మిత్రులు, ప్రజానీకం సహకారాన్ని అందించాలని కోరారు.

'పది' విద్యార్థులకు పరీక్ష మెటీరియల్

విశాలాంధ్ర-కంచికచర్ల : విద్యార్థినీ విద్యార్థులు కష్టపడి ఇష్టంగా చదివి పదో తరగతి మంచి ఫలితాలు సాధించాలని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు విద్యార్థిని విద్యార్థులకు తెలియ జేశారు.టిడిపి యువ నాయకులు బూత్ కన్వీనర్ బర్రె శంకరరావు తన సొంత నిధులు వెచ్చించి పదవ తరగతి చదివే 50 మంది విద్యార్థిని విద్యార్థులకు ప్యాడు, పెన్ను ,పెన్సిల్ ,ఎరేజర్, బొట్టు బిళ్లలు, కీ చైన్లు, స్కేలు, చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సిక్స్ ప్యాక్ బ్రోచర్,పదో తరగతి కావాల్సిన తదితర పరీక్ష మెటీరియల్స్ ను చెవిటికల్లు రోడ్డు నందుగల అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నందు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు చేతుల మీదుగా ఆదివారం విద్యార్థిని విద్యార్థులకు అందజేయడం జరిగినది.ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి కోగంటి మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలు నందు ప్రతి యొక్క విద్యార్థి ఉత్తమ ఫలితాలను సాధించి తల్లిదండ్రులతో పాటు స్కూలు కూడా మంచి పేరు తీసుకురావాలని కోగంటి తెలియజేశారు. 50 మంది విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా పదో తరగతి మెటీరియల్ అందజేసిన బర్రె శంకరరావును కోగంటి బాబు ప్రత్యేకంగా అభినందించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి కోగంటితో పాటు దేశ%శీ% నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గుత్తారత్నం, తాడపనేని లక్ష్మణరావు,టౌన్ పార్టీ అధ్యక్షులు వేమా వెంకటరావు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి ఆల్లడీ కోటేశ్వరరావు, మాజీ ఎంపిటిసి సభ్యులు రొంపిచర్ల శ్యాము, మండల టిడిపి పార్టీ ఉపాధ్యక్షులు పంచాయతీ వార్డు మెంబర్ గుత్తా ఓంకార్, గూడవల్లి గణేష్, విజయవాడ పార్లమెంటరీ ఎస్టీ సెల్ కార్య నిర్వహ కార్యదర్శి బాణావత్ సుధాకర్, మండల ఎస్టి సెల్ అధ్యక్షులు బానవత్ సైదులు,నంబూరు దుర్గారావు, ఎన్టీఆర్ జిల్లా ఐటీడీపి నాయకులు భాగవతుల ప్రదీప్, కోపూరు ఫణి, షేక్ మస్తాన్, పఠాన్ బాజీ ఖాన్, అజయ్, కేబుల్ ప్రసాద్, బుడ్డి సురేష్ ,తదితర టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీకి ఓటమి ఖాయం : గద్దె అనురాధ

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ఓటమి ఖాయమని మాజీ జెడ్పీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ జోష్యం చెప్పారు. తూర్పు నియోజక వర్గంలోని 15వ డివిజన్ రామలింగేశ్వర నగర్‌లో, 14వ డివిజన్ పుట్ట రోడ్, వాణి నగరలో అనురాధ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహి ళలకు చీరలు పంపిణీ చేశారు. ప్రతి ఇంటికీ ఇల్లి టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని ఏరులే పారిస్తూ ప్రజల ఆరోగ్యాలను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారం నిమిత్తం ఎక్కడికి వెళ్లినా వైసీపీ ప్రభుత్వం అమ్మే మద్యం తాగిన మగవారు రోగాల భారిన కుటుంబాలు చితికిపోతున్నాయన్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. వైసీపీ పాలనకు చరమగీతం పాడి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి తూర్పు నియోజక వర్గం టీడీపీ అభ్యరిగా గద్దె రామమోహన్, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపిపంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, ఝాన్సీరాణి, ఈశ్వరరావు, హేమా, మున్నీ, లక్ష్మీ ప్రసన్న, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలో ప్రజలపై భారాలు ఉండవు

టీడీపీ పాలనలో ప్రజలపై భారాలు ఉండవని, సంక్షేమానికి పెద్ద పీట వేయనున్నట్లు ఎమ్మెల్యే గద్దె తనయుడు గద్దె క్రాంతికుమార్ అన్నారు. తూర్పు నియోజక వర్గంలోని 3వ డివిజన్‌లో రామకృష్ణాపురంలో క్రాంతికుమార్ స్థానిక టీడీపీ, జనసే నాయకులతో కలిసి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో తీవ్రంగా ఉన్న డ్రెయినేజీ సమస్యతో పాటు స్థానికంగా పలు సమస్యలు తిష్టవేశాయని టీడీపీ అధికారంలోకి వస్తే సమస్యలన్నీ పరిష్కరించటం జరుగుతుందన్నారు. గద్దె నెక్కిన అధికార పార్టీ ఎక్కడి సమస్యలు అక్కడే వదిలేసి చెత్తపన్ను, నీటి, విద్యుత్ చార్జీలు పెంపు, డ్రెయినేజీ చార్జీలు పెంపుతో ప్రజలపై భారీలు వేసిందన్నారు. టీడీపీ హయంలో గద్దె రామమోహన్ చొరవతో డివిజన్‌లో ఎన్నో కార్యక్రమాలు జరిగ్గా, వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్క అభివృద్ధి పని చేపట్టలేదన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాబూరావు, బాలాజీ ప్రసాద్, కొండలరావు, హరీష్, వినయ్, బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల నిర్ణయాధికార స్వేచ్ఛ కోసం పోరాటం : పద్మ

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : మహిళలు, బాలికల విద్య వికాసం కొరకు కృషి చేసిన సావిత్రి బాయి పూలే 127వ వర్ధంతి రోజు అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ వారోత్సవాన్ని జరుపుకోవడం యాదృచ్ఛికమే అయినా ఎంతో సంతోషంగా ఉందని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యు) రాష్ట్ర కార్యదర్శి పి.పద్మ అన్నారు. మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు కె .దుర్గ అధ్యక్షతన జరిగిన సభలో పద్మ మాట్లాడుతూ పని గంటల తగ్గింపు కోరకు, మహిళలకు ఓటు హక్కు కోసం సాగిన మహిళా ఉద్యమం నుండి 114 సంవత్సరాల క్రితం మార్చి 8 శ్రామిక మహిళా దినోత్సవం ఆవిర్భవించిందని ఆమె గుర్తు చేశారు. వందేళ్లు దాటినా ఇప్పటికీ మహిళల పట్ల వివక్షత, చిన్న చూపు, వారి శ్రమ దోపిడీ కొనసాగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో సగ భాగంగా ఉన్న మహిళలకు అనేక రంగాలలో ఈనాడు ముందుకు వచ్చి ఎంత ఎత్తుకు ఎదుగుతున్నా వారు ఇప్పటికీ ద్వితీయ పౌరులుగా చూడబడుతున్నారని, దాడులకు గురికాబడుతున్నారన్నారు. స్త్రీని పురుషాధిక్య ప్రపంచం సొంత ఆస్తిగా చూస్తుందని, విలాస వస్తువుగా భావిస్తూ అత్యాచారాలకు ఒడిగడుతున్నారని ఇందుకు మనువాద భావజాలం కారణమన్నారు. స్త్రీ, పురుషులు సమానత్వం కలిగివుండే భౌతిక పరిస్థితులు కావాలని అందుకు మహిళలు పోరాడాలని, పురుషులు కూడా తమ పురుషాధిక్య భావజాలం వదులుకోని మహిళల స్వేచ్ఛకు విలువ ఇవ్వాలని కోరారు. నేడు బిజెపి ప్రభుత్వ దాడులకు మహిళలతో పాటు అన్ని వర్గాల ప్రజలు గురవుతున్నారని గుర్తు చేశారు. ఇలా మతం, జాతి, కుల, ప్రాంతీయ ఉన్మాదాలను బిజెపి ప్రభుత్వం రెచ్చగొడుతూ తన కార్పొరేట్ మనువాద పాలనను కొనసాగించుటకు ఫాసిజాన్ని అమలు చేస్తున్నాదని కావున మహిళలు తమ స్వేచ్ఛ, నిర్ణయాధికారం కోసం పోరాడుతునే బిజెపి ప్రభుత్వ ఫాసిస్టు విధానాలను ఓడించేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ సభలో చైతన్య మహిళా సంఘం నాయకురాలు లక్ష్మి, జమాతే ఇస్లాం హింద్ నాయకురాలు సుల్తానా, ఐ.ఎఫ్.టీ.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి తదితరులు పాల్గొన్నారు.

కొండలమ్మ దర్శనానికి తరలివచ్చిన భక్తులు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో ఆదివారం సందర్భంగా శ్రీ అమ్మవారిని సుమారు 10,000 మంది భక్తులు దర్శించుకొని, శ్రీ అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి వారి యొక్క మొక్కుబడులు తీర్చుకొనియున్నారు. శ్రీ అమ్మవారి దేవస్థానమునకు విచ్చేసిన భక్తులకు ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకొనుటకు ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీ శేషం వీర వెంకట కృష్ణమూర్తి (గోపి), దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ కానూరి సురేష్ బాబు గారు ఏర్పాట్లు పరిశీలించినారు.